సాక్షి
అనకాపల్లి
బుధవారం ౹ 5 ౹ ఫిబ్రవరి ౹ 2025


సూర్యనారాయణమూర్తి ఆలయం వద్ద భక్తజన సందోహం

న్యూస్‌రీల్

గ్రామీణ 'మణి కిరణం'

- స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలో జేఈగా ఎంపికైన రైతు బిడ్డ


మణికిరణ్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు


రోలుగుంట: అతనిది ఓ కుగ్రామం. రైతు కుటుంబం నుంచి వచ్చాడు. చిన్నప్పటి నుంచి కష్టపడి చదువుకొని డిప్లొమా తీసుకున్నాడు. తన లక్ష్యాలన్నింటినీ అధిగమిస్తూ.. ఎస్‌ఎస్‌సీ జేఈ పరీక్షలో సీపీడబ్ల్యూడీలో ఆలిండియా స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించాడు. రోలుగుంట మండలం కొండపాలేనికి చెందిన గాలి అర్జున, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు వినాయక మణికుమార్. అయిదో తరగతి వరకూ కొండపాలెం ప్రభుత్వ పాఠశాలలో చదివి, ఆరు నుంచి పది వరకు మండల కేంద్రం రోలుగుంటలో చదివాడు. తరువాత బొబ్బిలిలో తాండ్రపాపారాయుడు కాలేజీలో డిప్లొమా చేశాడు. కష్టపడి సాధన చేసి, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సీపీడబ్ల్యూడీ డిపార్టుమెంట్ కోసం నిర్వహించిన పరీక్షలో జాతీయ స్థాయిలో నాలుగోవాడిగా నిలిచాడు. జేఈగా ఉద్యోగం సాధించాడు. గ్రామ మాజీ సర్పంచ్ బంటు సూర్య సన్యాసిదేముళ్లు, గ్రామంలోని యువత అతనిని అభినందనల్లో ముంచెత్తారు. ఇతని తమ్ముడు శివభాస్కర్ గత ఏడాది రైల్వేలో ఏఈగా ఎంపికయ్యాడు. ఇద్దరు కుమారులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు.

ఒడిశాలో ఘనంగా శ్రీనృసింహ హోమం


శ్రీనృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లా పద్మనాభపురంలో మంగళవారం శ్రీనృసింహ హోమం ఘనంగా జరిగింది. సింహాచలం దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఒడిశాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా పద్మనాభపురంలో ఉదయం శ్రీనృసింహ హోమం పెద్ద ఎత్తున నిర్వహించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను, చక్రపెరుమాళ్లని కొలువుంచారు. హోమ గుండం వద్ద విష్వక్సేణ పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్ని ప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను విశేషంగా జరిపారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు పవన్‌కుమార్, వేదపండితులు ఈ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

ఎమ్మెల్సీ స్థానానికి మూడు నామినేషన్లు


ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ అనంతరం ప్రమాణం చేస్తున్న సత్తలూరి శ్రీరంగ పద్మావతి

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌కు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ఆర్వో సమక్షంలో ప్రమాణం చేశారు. ఏపీటీఎఫ్ మద్దతుదారుగా బరిలోకి దిగిన పాకలపాటి రఘువర్మ రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేయగా, కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి ఒక్కో సెట్ పత్రాలను ఆర్వోకు సమర్పించారు. రఘువర్మ వెంట ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మద్దతుదారులు తరలివచ్చారు.

కన్యకాపరమేశ్వరి ప్రతిష్ట ముగింపోత్సవాలు



వెండిరథంపై అమ్మవారి శోభాయాత్ర కనుల పండువగా జరిగింది. అనకాపల్లి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రతిష్ట శత జయంతి ముగింపు ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. 8లో

శ్రీసూర్యనారాయణ..

వేద పారాయణ..

రాజుపాలెం సూర్యనారాయణమూర్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు


స్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు


మాడుగుల మండలం సత్యవరం వద్ద శారద నదిలో సామూహికంగా సూర్యనమస్కారాలు నిర్వహిస్తున్న భక్తులు


పూజలందుకుంటున్న సూర్యనారాయణమూర్తి

అనకాపల్లి: ప్రత్యక్ష దైవానికి జగతి భక్తితో ప్రణమిల్లింది. సకల జీవరాశులకు ప్రాణశక్తిని ఇచ్చి చల్లగా చూసే లోకబాంధవుడికి ప్రీతికరమైన రథసప్తమి రోజున ఆ దివ్యతేజోమూర్తి కరుణా కటాక్షాల కోసం అఖిల భక్తకోటి అంజలి ఘటించింది. ప్రభాకరుడి ఆలయాలలో ఆదిత్య హృదయ పఠనం మార్మోగింది. రాజుపాలెం సూర్యనారాయణస్వామిని వేలాదిమంది భక్తులు మంగళవారం దర్శించుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో నిలిచారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవాదళ్ సభ్యులు భక్తులకు ఎక్కడికక్కడ సహకరించారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. ఇరుకైన రహదారి కావడంతో వాహనాలు అడ్డుగా ఉండడంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. డీఎస్పీ ఎం.శ్రావణి ఆధ్వర్యంలో రూరల్, పట్టణ, ట్రాఫిక్ సీఐలు అశోక్‌కుమార్, టి.వి.విజయకుమార్, ఎం.నారాయణమూర్తి ఆధ్వర్యంలో సుమారు 150 మంది సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ కర్రి కోటేశ్వరరావు, కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామిని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు మలసాల కుమార్‌రాజా, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రాజుపాలెం పరిసర ప్రాంతంలో రథంపై కమిటీ సభ్యులు ఊరేగించారు. వ్యాపారవేత్త బంగారు సూరిబాబు, ఆదిబాబు దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. రాత్రికి స్టేజ్ ప్రోగ్రాంలు, నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. భారీ బాణాసంచాతో ఆలయ పరిసరాలు కాంతులీనాయి.

శారద నదీ తీరంలో సూర్య నమస్కారాలు

మాడుగుల: సత్యవరం గ్రామంలో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రథ సప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శారద నది ఒడ్డున తెల్లవారక ముందే పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు, సూర్యనమస్కారాలు ఆచరించారు. నది ఒడ్డున పాయసం తయారు చేసి సూర్యదేవునికి సమర్పించి, ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ధర్మ ప్రచారకుడు సన్యాసిశెట్టి మాట్లాడుతూ నదిలో రథసప్తమి రోజున స్నానం చేసి, సూర్యనమస్కారాలు చేస్తే ఆరోగ్యంతోపాటు కోటి జన్మల పుణ్యం వస్తుందన్నారు. హిందూ ధర్మ ప్రచార ఃసభ్యులు బోదా పాల్గుణ, ఎం.రాజేశ్వరి, నానుబిల్లి రాజేశ్వరి, గెంజి మాలతి, మిరియాల సత్యవతి, గాడి కొండతల్లి, గెంజి ఈశ్వరి, చినమ్మలు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని వీడలేదని నిందారోపణలు

- రాజకీయం కోసం వెంకన్న ప్రతిష్ట దిగజార్చవద్దు
- ఆలయ అభివృద్ధికి అంతా కలిసిరండి
- వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కన్నబాబు


విలేకరులతో మాట్లాడుతున్న దొండా కన్నబాబు

బుచ్చెయ్యపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడలేదన్న అక్కసుతో దేవుడిని అడ్డుపెట్టుకుని తనపై కూటమి నేతలు లేనిపోని నిందారోపణలు చేస్తున్నారని వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు ధ్వజమెత్తారు. స్వార్థ రాజకీయాల కోసం పవిత్రమైన వేంకటేశ్వరస్వామిని అడ్డుపెట్టుకుని లేనిపోని ఆరోపణలు చేస్తూ వడ్డాది పేరు ప్రతిష్టలను దెబ్బ తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధికి పాలక మండలి, అధికార్లు అడ్డుపడుతున్నారని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు చేసిన ప్రకటనపై కన్నబాబు తీవ్ర ఆగ్రహం చెందారు. మంగళవారం ఆలయ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈవో శర్మతో కలిసి వడ్డాది వేంకటేశ్వరస్వామికి వస్తున్న ఆదాయ, వ్యయ వివరాలను వెల్లడించారు. వడ్డాది వేంకటేశ్వరస్వామికి ఏడాదికి సుమారు రూ.14 లక్షల వరకు ఆదాయం రాగా రూ.15 లక్షల వరకు ఖర్చులు అవుతున్నాయని చెప్పారు. గత నాలుగు నెలలుగా వైఎస్సార్‌సీపీని వీడి జనసేనలో చేరాలని సన్యాసిరావుతోపాటు నలుగురు వ్యక్తులు తనపై ఒత్తిడి తెస్తున్నారని.. పార్టీ మారనని, వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతానని చెప్పడంతో దేవుడిని అడ్డుపెట్టుకుని కుటిల రాజకీయాలకు దిగారన్నారు. వీరి స్వార్థ రాజకీయం కోసం ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెంది 151 ఏళ్ల చరిత్ర గల వేంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రతను దెబ్బ తీయడం తగదన్నారు.

తాతల కాలం నుంచీ వెంకన్న సేవలో..

తన తాత వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించి 56 ఎకరాలు భూములివ్వగా అన్యాక్రాంతం అవకుండా చూస్తున్నామని, ఇటీవల తాను 22 సెంట్ల భూమిని దేవస్థానానికి ఇచ్చానని కన్నబాబు చెప్పారు. 36 ఏళ్లుగా దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తగా ఉంటూ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు చేస్తున్నానని, గత రెండేళ్లుగా తన ఆరోగ్యం సహకరించక, గంటల కొలది నేలపై మఠం వేసుకుని కూర్చునే పరిస్థితి లేక తన అన్న కుమారుడి చేత వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలను దగ్గరుండి చేయిస్తున్నానన్నారు. అర్చకుల సూచనలతోనే అతనితో కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. విశాఖ డెయిరీ ద్వారా కల్యాణ మండపం నిర్మించబోగా వడ్డాదిలో ఉన్న నాయకుల వల్ల కొండపైన మండపం అధికారుల తీరు వల్ల ఆగిపోయిందన్నారు. ఆరోగ్యం బాగోక తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని అనుకున్నానని, కొంతమంది స్వార్థ రాజకీయాల తీరు కారణంగా వచ్చే స్థానిక ఎన్నికల్లో తన కుమారుడిని గాని తన అన్న కుమారుడిని గాని నిలబెట్టి వడ్డాది పేరు ప్రఖ్యాతులు పెరిగేలా కృషి చేస్తానని కన్నబాబు తెలిపారు. వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి, కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి పార్టీలకు అతీతంగా అంతా కలిసి రావాలని కోరారు. ఆలయంలో దొంగ టికెట్లు అమ్ముతున్నట్లు నిరూపించాలని ఈవో శర్మ కోరారు. ఆలయ అభివృద్ధికి తోడ్పడిన భక్తులను దేవస్థానం తరఫున సత్కరిస్తున్నామని చెప్పారు.

వైఎస్ జగన్‌ను కలిసిన జిల్లా నేతలు


మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శాలువాతో సత్కరించిన కరణం ధర్మశ్రీ, గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, బొడ్డేడ ప్రసాద్ తదితరులు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో జిల్లా నేతలు మర్యాదపూర్వగంగా కలిశారు. పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాడుగుల సమన్వయకర్త బూడి ముత్యాల నాయుడు, చోడవరం సమన్వయకర్త, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనకాపల్లి పార్లమెంటు స్థానం పరిధిలో పార్టీ బలోపేతానికి కృషి చేసి.. కార్యకర్తలను కలుపుకొని పోవాలని ధర్మశ్రీతో జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలో పార్టీ పరిస్థితి గురించి వాకబు చేస్తూ.. బాధ్యతలు అప్పగించిన వెంటనే పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తల్లో జోష్ పెంచావని అభినందించారు.

చోడవరం నియోజకవర్గంలో గుడివాడ అమర్‌నాథ్‌కు అండగా ఉండాలని ధర్మశ్రీకి సూచించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ తమ అధినేత జగన్ చాలా ఉత్సాహంగా ఉన్నారని, కార్యకర్తలు, నాయకులు మరింత ఉత్తేజంతో పనిచేయాలని కోరారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ ఉన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా

వెంకన్న కల్యాణోత్సవాలు

- రాష్ట్ర హోం మంత్రి అనిత సూచన


కల్యాణోత్సవాలపై స్థానికులు, దేవస్థాన సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి అనిత

నక్కపల్లి: మార్చి 10వ తేదీన ఉపమాకలో జరిగే వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర హోం మంత్రి వంగల పూడి అనిత దేవస్థానం అధికారులకు, స్థానిక నాయకులకు సూచించారు. రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం ఆమె ఉపమాక వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం వచ్చే నెలలో జరిగే కల్యాణోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. కల్యాణోత్సవాల్లో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, ఎటువంటి లోటుపాట్లు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. తోపులాటకు ఆస్కారం లేకుండా చక్కగా దర్శనం అయ్యేటట్టు ప్రత్యేక క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, తదితరులు మాట్లాడుతూ స్వామివారి పుష్కరిణిని శుభ్రం చేయించాలన్నారు. తిరుపతి లడ్డూలు ఇక్కడ విక్రయించే ఏర్పాటు చేయాలని కోరారు. స్థానికులు సూచించిన విషయాలను వినతిపత్రం రూపంలో తయారు చేసి తనకు అందజేస్తే టీటీడీ చైర్మన్, ఈవోల దృష్టికి తీసుకెళ్లి భక్తుల ప్రశంసలందుకునేలా కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు చేయిస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. అర్చక స్వాములు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు


పార్కులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన దళిత నాయకులు

పాయకరావుపేట: పట్టణంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కులో మళ్లీ అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పారు. గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో పలువురు దళిత నాయకులు నిందితులను పట్టుకుని శిక్షించాలని నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. వారు పూనుకొని మళ్లీ యథాస్థానంలో నూతనంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక న్యాయవాది బీఏఆర్ అంబేడ్కర్, దళిత నాయకులు పల్లా విలియం కేరి, నెలపర్తి నాగేశ్వరరావు, గారా రమేష్, ఇంరపు సూరిబాబు, ఐఎస్ మూర్తి, చిరుకూరి పేర్రాజు, కొల్లాబత్తుల దిలీప్, పల్లా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను జయించిన విజేతలు



ఆరిలోవ: క్యాన్సర్‌ను గుర్తించదగిన వ్యాధిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని కోరుతూ జాతీయ స్థాయిలో ప్రచారం చేయనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ వాణి తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని మంగళవారం హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రి క్యాన్సర్ విభాగంలో నిర్వహించారు. అపోలో క్యాన్సర్ సెంటర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), రాష్ట్ర అంకాలజీ సంఘాల సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అపోలో ఆస్పత్రిలో క్యాన్సర్ చికిత్స పొంది విజేతలుగా నిలిచినవారికి మెడల్స్ అందించి గౌరవించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ అపోలోలో క్యాన్సర్‌పై 'యునిఫై టు నోటిఫై' అనే నినాదంతో జాతీయ క్యాంపైన్ చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మురళీ మోహన్, అపోలో వైద్యుడు రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

షబ్నమ్‌కు ఘన స్వాగతం


విశాఖ విమానాశ్రయంలో క్రికెటర్ షబ్నమ్ షకీల్‌కు స్వాగతం పలుకుతున్న జియ్యాని విజయ్

గోపాలపట్నం: ఇటీవల కౌలాలంపూర్‌లో జరిగిన అండర్–19 మహిళల టీ–20 ప్రపంచ కప్ గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచిన నగరానికి చెందిన షబ్నమ్ షకీల్ మంగళవారం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆమెకు 52వ వార్డు యువజన నాయకుడు జియ్యాని విజయ్, క్రికెట్ అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఇటీవల విశాఖకు చెందిన క్రికెటర్లు మంచి ప్రతిభ చూపిస్తున్నారని అన్నారు. మహిళా క్రికెట్‌లో షబ్నమ్ షకీల్, పురుషుల క్రికెట్‌లో నితీష్ కుమార్‌రెడ్డి మంచి ప్రతిభ కనబరిచి అందరి దృష్టిని ఆకర్షించారన్నారు. షబ్నమ్ ఈ ప్రపంచ కప్ సాధనలో కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. అనంతరం షబ్నమ్ తల్లిదండ్రుల్ని ఘనంగా సత్కరించారు.

తల్లిదండ్రుల ఆశీస్సులే కారణం

ప్రపంచ కప్‌లో ఘన విజయం సాధించడంలో తల్లిదండ్రుల ఆశీర్వాదం, వారి ప్రోత్సాహమే ప్రధాన కారణమని షబ్నమ్ అన్నారు. విశాఖ విమానాశ్రయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. తన తల్లి దండ్రులు ఎంతో కష్టపడి తనకు శిక్షణ ఇప్పించి, ఈ స్థాయికి తీసుకు వచ్చారని పేర్కొన్నారు. ప్రపంచ కప్ టోర్నీలో అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ కప్ మ్యాచ్‌లలో ఎటువంటి ఒత్తిడికి గురవకుండా ఆటను ఎంజాయ్ చేసినట్లు చెప్పారు. అందుకే మంచిగా రాణించి కప్ గెలిచామన్నారు.

పశుగణన

ముమ్మరం

- ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న సిబ్బంది
- ఇంతవరకు 85 శాతం పూర్తి
- ఈ నెలాఖరుకు పూర్తి కానున్న సర్వే


ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న పశువైద్యాధికారి పుష్ప, సిబ్బంది

నర్సీపట్నం: జిల్లాలో పశుగణన చురుగ్గా జరుగుతోంది. అన్ని రకాల పశు పక్ష్యాదులను లెక్కిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్త సర్వేలో భాగంగా జిల్లాలో ముమ్మరంగా పశుగణన చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 311 మంది ఎన్యూమరేటర్లు సర్వే చేస్తున్నారు. వీరంతా ఇంటింటికీ తిరిగి పశువుల లెక్కలు తీస్తున్నారు. రైతులు అందుబాటులో ఉండే సమయాలైన ఉదయం, సాయంత్రం వేళల్లో వివరాలు సేకస్తున్నారు. సర్వే ఈ నెలాఖరు నాటికి ముగియాల్సి ఉంది. జిల్లాలో అవాసాలు 762 ఉన్నాయి. 4,71,906 గృహాలు ఉన్నాయి. సగటున ఒక్కో ఎన్యూమరేటర్ రోజుకు 15 గృహాల చొప్పున సర్వే చేస్తున్నారు. గత ఏడాది నవంబరు ఒకటిన ప్రారంభమైన సర్వే ఇప్పటి వరకు 85 శాతం పూర్తయింది. శతశాతం జీవాల గణన పూర్తి చేయాలన్న లక్ష్యంతో పశుసంవర్ధకశాఖ అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు.

అన్ని రకాల జంతువులు 38.37 లక్షలు

జిల్లాలో అన్ని రకాల జంతువులు 38,37,749 లక్షలు ఉన్నట్లు నాలుగేళ్ల క్రితం జరిగిన పశుగణనలో అధికారులు తేల్చారు. వీటిలో ఆవులు 180673, ఎద్దులు 246293, గొర్రెలు 106358, మేకలు 179797, కోళ్లు 3124020, పందులు 489, గుర్రాలు 119 ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గడువు సమీపిస్తుండడంతో సర్వేను వేగవంతం చేశారు. నిర్దేశించిన సమయానికి సర్వేను పూర్తి చేసేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది శ్రమిస్తున్నారు.

శతశాతం సర్వేకు సహకరించాలి



అధికారులు, వైద్యులు, సిబ్బంది పశుగణనలో పాల్గొంటున్నారు. ఎన్యూమరేటర్లు ప్రతి గ్రామానికి ఒకరు ఉన్నారు. వీరు సెల్ ఫోన్ ద్వారా యాప్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఈ నెలాఖరుకు పశుగణన పూర్తి చేస్తాం. పశువైద్యులు, పశువైద్య సిబ్బంది సర్వే చేయడానికి ఇంటి వద్దకు వచ్చినప్పుడు వివరాలు తెలియజేసి, శతశాతం సాధించేందుకు సహకరించాలి.

– డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు, పశుసంవర్ధక శాఖ ఏడీ, నర్సీపట్నం

క్లుప్తంగా

ఈఈఎంటీ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



జగదీశ్వరరావును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మాకవరపాలెం : ఈఈఎంటీ మెయిన్స్‌లో ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపారని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. ఈ విద్యార్థులను మంగళవారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థి జగదీశ్వరరావు, తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి వెంకటనాగసాయి గత నెల 9న నిర్వహించిన ఈఈఎంటీ పరీక్షలో పాల్గొన్నారన్నారు. ఈ పరీక్షలో జగదీశ్వరరావు జిల్లా ప్రథమ, వెంకటనాగసాయి ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. వీరికి నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రాలను ఈ నెల 8న అమరావతిలో అందజేస్తారన్నారు. విద్యార్థులను ఆయనతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు



గంజాయి కేసులో నిందితుడితో పట్టణ ఎస్ఐ ఈశ్వరరావు, పోలీసులు

అనకాపల్లి : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న మండలంలోని కూండ్రం గ్రామానికి చెందిన మొల్లి గంగునాయుడుని మండలంలో కొత్తూరు జంక్షన్ వద్ద బైక్‌పై వెళుతుండగా మంగళవారం పట్టుకోవడం జరిగిందని పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు చెప్పారు. గతంలో గంజాయి కేసులో ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చడం జరిగిందని, మరో వ్యక్తి గంగునాయుడుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్ఐ చెప్పారు. నిందితుడి నుంచి పల్సర్ బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బహిరంగ మద్యపానం నేరం

రాంబిల్లి (యలమంచిలి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ఆరుగురు వ్యక్తులపై మంగళవారం కేసులు నమోదు చేశామని రాంబిల్లి సీఐ సీహెచ్ నరసింగరావు చెప్పారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహీన్‌సిన్హా ఆదేశాల మేరకు రాంబిల్లి మండలంలో పలు ప్రాంతాల్లో పబ్లిక్ ప్రదేశాల్లో బహిరంగంగా మద్యం సేవించిన వారిపై దాడులు చేసి ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామని, జనసంచారం ఉండే ప్రాంతాల్లో మద్యం సేవించరాదని, మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గంజాయి, లేదా డ్రగ్స్ సేవించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

పెళ్లి కళ వచ్చేసింది..



జూన్ 7 వరకు శుభ ముహూర్తాలు

4నెలల పాటు వివాహాలు, గృహప్రవేశాల సందడి

జిల్లాలో సుమారు 3 వేలకు పైగా శుభకార్యాలు

అనేక రంగాలకు జీవనోపాధి

పురోహితులు, మండపాలకు డిమాండ్

యలమంచిలి రూరల్ : మాఘ మాసం ఎప్పుడొస్తుందోనని పెళ్లి చేసుకునే వారే కాకుండా వ్యాపారులూ ఎదురుచూస్తుంటారు. శుభముహూర్తాలు ఉండని పుష్యమాసం వెళ్లి, సరిగ్గా 36 రోజుల విరామం తర్వాత మాఘమాసం రావడంతో మళ్లీ పెళ్లి బాజాలు మోగనున్నాయి. మాఘ మాసం సహా వచ్చే మాసాలన్నీ శుభకార్యాలకు శ్రేష్ఠం కావడంతో నేటి నుంచి జూన్ 7 వరకు జోరుగా వివాహాలు జరగనున్నాయి. గత ఏడాది డిసెంబర్ 25 నుంచి ఈ ఏడాది జనవరి 30 వరకు ముహూర్తాలు లేకపోవడంతో వివాహాలకు బ్రేక్ పడింది. దీంతో శుభకార్యాలు లేక ఫంక్షన్ హాళ్లు, టెంట్ హౌస్‌లు, డెకరేషన్, బంగారు, వస్త్ర దుకాణాలు వెలవెలబోయాయి. తిరిగి మళ్లీ శుభకార్యాలకు ముహూర్తాలు ఉండడంతో జిల్లాలో అన్ని ప్రాంతాల్లో రాబోయే రోజులన్నీ భాజాభజంత్రీలతో



మారుమోగనున్నాయి. వివాహాలు, గృహప్రవేశాలు, ఉపనయనాలు, పంచెకట్టు, ఆడబిడ్డలకు ఒడి బియ్యం, నిశ్చితార్థం, కొత్త నిర్మాణాలకు శంకుస్థాపన తదితర కార్యక్రమాలకు వరుసగా రాబోయే నెలల్లో 40 వరకు ముహూర్తాలున్నాయని జిల్లా పురోహిత సంఘం అధ్యక్షుడు పెద్దింటి సూర్యనారాయణమూర్తి, తెలిపారు.

ఫంక్షన్ హాళ్లకు గిరాకీ

మాఘమాసంలో సుముహూర్తాలు ఉండడంతో ముందుగానే కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లను బుక్ చేసుకోవడంతో వాటికి డిమాండ్ ఏర్పడింది. కల్యాణ మండపాలు దొరకని వారు తమ ఇళ్ల వద్ద, విశాలమైన ఖాళీ స్థలాల్లో శుభకార్యాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

విందులకు వెనుకాడకుండా...

విందు లేనిదే పెళ్లి ఉండదు. భోజనాలు రుచిగా, శుచిగా ఉండాలని, బంధుమిత్రుల్లో మాట రాకూడని భావిస్తారు. అందుకే ఎంత ఖర్చయినా వెనుకాడరు. ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనం వరకు..వంటకాలను అందించే క్యాటరింగ్ సంస్థలు ఆర్డర్లతో బిజీగా మారనున్నాయి. ఇక పురోహితులు, డెకరేషన్, మంగళవాయిద్యాలు, కళాకారులకు, ఫొటో, వీడియో గ్రాఫర్స్, కల్చరల్ ఈవెంట్ ఆర్గనైజర్స్(ఆర్కెస్ట్రా), క్యాటరింగ్, బ్యూటీపార్లర్ నిర్వాహకులకు, ట్రావెల్స్ ఏజెన్సీలు, పూల వ్యాపారులు, సౌండ్, లైటింగ్ డెకరేటర్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. అలాగే పట్టు వస్త్రాలు,బంగారు,అలంకరణ వస్తువులు, పూల వ్యాపారాలు జోరందుకున్నాయి. దీంతో మార్కెట్ కళకళలాడుతోంది.

సుముహూర్తాలు ఇలా..

ఫిబ్రవరి: 2,6,7,8,13,14,15,16,20,22,23
మార్చి: 1,2,7,9,12,14,15,16
ఏప్రిల్: 9,10,11,12,17,18,20.23,29,30
మే: 1,7,8,9,10,11,14,15,16,
17,18,21,22,23,28 (జేష్ఠమాసం)
జూన్: 1,2,4,7

పసిడి వెలుగులు

శుభకార్యాల దృష్ట్యా బంగారు వ్యాపారులకూ ఆర్డర్లు పెరిగాయి. కొత్త ఆభరణాల తయారీకి వివిధ డిజైన్లతో వ్యాపారులు సిద్ధమయ్యారు. వినియోగదారులు కోరిన డిజైన్లలో తయారు చేయిస్తూ బిజీగా ఉంటున్నారు. సాధారణంగా పెళ్లిళ్లలో అమ్మాయికి, అబ్బాయికి 5 తులాల బంగారం, 40 తులాల వెండి చొప్పున కనీసం పెడుతున్నారని పురోహితులు చెబుతున్నారు.

మాఘమాసం ప్రత్యేకం



మాఘమాసం వివాహాలకు ప్రత్యేకం. ఫిబ్రవరి 7,8 తేదీల్లో అత్యంత శుభప్రదమైన ముహూర్తాలు ఉన్నాయి. ఈ రెండు రోజుల్లో వేలాది వివాహాలు జరగనున్నాయి. జూన్ 7 వరకు వేలాది జంటలు ఒక్కటి కానున్నాయి. వివాహాలతో పాటు గృహ ప్రవేశాలు, శంకుస్థాపన ముహూర్తాలు ఉన్నాయి.

–పెద్దింటి సూర్యనారాయణమూర్తి, జిల్లా పురోహిత సంఘం అధ్యక్షుడు

కొత్త వంటకాలపై ఆసక్తి



మారుతున్న కాలానికి అనుగుణంగా వివాహాది శుభకార్యాల్లో కొత్త వంటకాలపై ఆసక్తి చూపుతున్నారు. అందుకే సరికొత్త వంటకాలను రుచి చూపించడానికి సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తాం.పెళ్లిళ్ల సీజన్‌లో ఆదాయం వస్తే మిగతా కాలంలో నిర్వహణ చేయగలుగుతాం. అందుకే వంటకాల తయారీలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం.కస్టమర్ల అభిరుచికి తగినట్టుగా చూసుకుంటాం.

–కొఠారు నానాజీ, క్యాటరింగ్ నిర్వాహకుడు

పూలకు డిమాండ్ పెరిగింది



మాఘ మాసంలో శుభకార్యాలు మొదలు కావడంతో పూలకు ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడింది. రకరకాల పూలతో దండలు, అలంకరణతో పాటు జెడకు పెట్టుకునే పూదండల తయారీతో చేతినిండా పని దొరికింది. ధరలు కూడా బాగా పెరిగాయి. ఈ సీజన్‌లో మూడు నెలలు ఉపాధికి ఢోకా లేదు. మాతోపాటు మా సిబ్బందికి కూడా ఆదాయం మెండుగా వస్తుంది.

–చిన్నాల శ్రీనివాస్, పూల వ్యాపారి

పెట్రోల్ క్యాన్‌తో కోఆపరేటివ్ బ్యాంక్ ఉద్యోగి హల్‌చల్



సెక్రటరీ కృష్ణ చేతుల్లో పెట్రోల్ క్యాన్‌ను లాక్కుంటున్న బీఎం నాయుడు, సిబ్బంది

నర్సీపట్నం : పెట్రోల్ క్యాన్లతో కోఆపరేటివ్ బ్యాంక్ ఉద్యోగి హల్‌చల్ చేశాడు. ఉద్యోగి తీరుతో బ్యాంక్ అధికారులు హడలెత్తిపోయారు. బ్యాంక్ అధికారుల కథనం ప్రకారం రోలుగుంట మండలం, జానకీరామపురం కోఆపరేటివ్ సొసైటీ సెక్రటరీగా పని చేస్తున్న కృష్ణ పెట్రోల్ క్యాన్లు తీసుకుని మంగళవారం నర్సీపట్నం బ్రాంచ్‌లోకి ప్రవేశించాడు. పెట్రోల్‌తో బీఎం క్యాబిన్‌లో ప్రవేశిస్తుండగా సిబ్బంది అప్రమత్తమయ్యారు. అతని చేతుల్లోని పెట్రోల్ క్యాన్లను లాక్కునేందుకు ప్రయత్నించడంతో కృష్ణ ప్రతిఘటించాడు. బ్యాంక్ సిబ్బంది సమాచారంతో పోలీసులు బ్యాంక్‌కు చేరుకుని పెట్రోల్ క్యాన్లతో కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. తొమ్మిది నెలలగా జీతం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న అధికారుల తీరుకు మనస్థాపానికి గురై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకోవాలనే వచ్చానని సెక్రటరీ కృష్ణ చెబుతున్నాడు. సెక్రటరీ సొసైటీ నిధులు దుర్వినియోగానికి పాల్పడడం వల్ల అధికారులు జీతం నిలుపుదల చేశారని, ఏదైనా ఉంటే ఉన్నతాధికారుల వద్ద తేల్చుకోకుండా మాపై దాడికి ప్రయత్నించాడని బ్యాంక్ ఉద్యోగులు పేర్కొంటున్నారు. డీసీసీబీ సీఈవో ఆదేశాల మేరకు బ్రాంచి మేనేజర్ నాయుడు కృష్ణపై టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాంక్ రెండు వైపులా గేట్లకు తాళాలు వేసేసి, పెట్రోల్ క్యాన్లతో లోపలికి వచ్చాడని, తమను హత్య చేయడంతో పాటు బ్యాంక్‌ను తగలబెట్టాలనే ఆలోచనతో కృష్ణ 30 లీటర్ల పెట్రోల్ టిన్నులతో వచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు విచారణ చేస్తున్నామని టౌన్ సీఐ గోవిందరావు తెలిపారు.

చెరకు కాటా సిబ్బంది పొట్ట కొట్టేలా...!

- పచ్చ నేతల కుయుక్తులు
- తమ పార్టీ కార్యకర్తలను నియమించుకునే యత్నాలు
- సుగర్ ఫ్యాక్టరీ ఎండీపై ఒత్తిళ్లు



తెనుగుపూడి చెరకు తూనిక కేంద్రం యార్డులో నిలిచిపోయిన చెరకు

దేవరాపల్లి: అధికారం అండతో పచ్చ పార్టీ నేతలు రెచ్చిపోతున్నారు. టీడీపీ కార్యకర్తలు తప్ప ఇతరులెవ్వరూ ప్రభుత్వ, సహకార సొసైటీల్లో పనిచేయడానికి వీల్లేదని బరితెగిస్తున్నారు. చిన్నపాటి గుమస్తాలు, రోజు కూలి విధానంలో పని చేసే సిబ్బంది పొట్టగొట్టేందుకు తెగబడుతున్నారు. తాజాగా గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని దేవరాపల్లి మండలం తెనుగుపూడిలోని చెరకు తూనిక కేంద్రం (చెరకు కాటా)పై పచ్చనేతలు నీచ రాజకీయాలకు దిగారు. స్థానిక చెరకు కాటా వద్ద ప్రస్తుతం పని చేస్తున్న ముగ్గురు సిబ్బందిని(గుమస్తాలు) తొలగించి, ఆ స్థానంలో టీడీపీకి చెందిన పార్టీ కార్యకర్తలను నియమించుకునేందుకు కుట్రలకు తెరలేపారు. తెనుగుపూడి టీడీపీ నేతలు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ద్వారా గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎండీపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలోనే తెనుగుపూడి కాటాలో ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బంది స్థానంలో ఫ్యాక్టరీ యాజమాన్యం కొత్తగా సిబ్బందిని నియమించిందని అక్కడి గుమస్తాలకు మంగళవారం ఫ్యాక్టరీ సూపర్‌వైజర్లు చెప్పడంతో వివాదం చెలరేగింది. సుమారు మూడేళ్లుగా పని చేస్తున్న తమను అర్ధంతరంగా ఎలా తొలగిస్తారంటూ సదరు సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తూ విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. దీంతో కాటాకు తీసుకువచ్చిన చెరకు యార్డులోనే నిలిచిపోయింది.

టీడీపీ సిగ్గుమాలిన రాజకీయాల పట్ల స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీ అధికారంలో ఉంటే కొత్తగా ఉద్యోగాలు వేయించుకోవాలి తప్ప, ప్రస్తుతం పని చేస్తున్న వారి పొట్ట కొట్టడం ఏమిటని నేతల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కాటా వద్ద ఉన్న చెరకును ఫ్యాక్టరీకి తరలించేందుకు అవకాశం ఇవ్వాలని ఫ్యాక్టరీ సిబ్బందిని కోరగా బాధిత సిబ్బంది అంగీకరించడంతో సాయంత్రం చెరకును తరలించారు.

బూడి చొరవతో కాటా ఏర్పాటు...

స్థానికంగా చెరకు కాటా ఏర్పాటు చేయాలని స్థానిక రైతుల దశాబ్దాల కలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు నెరవేర్చారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చించి 2023 జనవరి 7న చెరకు కాటాను ప్రారంభించారు. ఈ కాటాతో తెనుగుపూడి, గరిశింగి, చినగంగవరం, వెంకటరాజుపురం, వాకపల్లి, మారేపల్లి, తిమిరాం గ్రామాల చెరకు రైతులకు దశాబ్దాల కష్టాలు తీరాయి. గతంలో పలుమార్లు అధికారం చేపట్టిన టీడీపీ నాయకులు ఇక్కడ చెరకు కాటా ఏర్పాటుకు ప్రయత్నం సైతం చేయకపోగా పెత్తనం కోసం పాకులాడడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

కన్యకాపరమేశ్వరి ప్రతిష్ట ముగింపోత్సవాలు

- వెండిరథంపై అమ్మవారి శోభాయాత్ర
- ఊరేగింపులో అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



వెండిరథంపై శోభాయాత్ర నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి : స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ శత జయంతి ముగింపు ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు రేజేటి శ్రీరామాచార్యులు, రేజేటి సీతారామాచార్యులు, అర్చకులు కొండమంచిలి వీరవెంకట సత్యనారాయణమూర్తి, కొడమంచిలి కమలాకర్ శ్రీరామప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి తెల్లవారు జాము నుంచి విశేష పూజలు జరిగాయి. సాయంత్రం 4 గంటలకు పట్టణంలో అమ్మవారి వెండి రథంపై నగర తిరువీధుల్లో మేలతాళాలతో కోలాటాలతో అమ్మవారి ఊరేగింపు శోభాయాత్ర జరిగింది. పులివేషాలు, దేవతామూర్తుల నేలవేషాలు, కోలాటం, పలు సంస్కృతిక కార్యక్రమాలు, మహిళలతో వాసవీమాత నామ సంకీర్తన జరిగాయి. ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు మాట్లాడుతూ ముగింపోత్సవాలు ఈనెల 8వ తేదీ వరకూ నిర్వహించడం జరుగుతుందన్నారు. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం జనార్దన స్వామివారి ప్రీత్యర్థం సామూహిక లక్ష తులసి నామార్చనలు, నిత్యహోమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి సోమరాజు, ఉపాధ్యక్షుడు రవిరామ్ జవహర్, సహాయ కార్యదర్శి గ్రంధి మాణిక్యం, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



శోభాయాత్రంలో పాల్గొన్న మహిళా భక్తులు



ఆకట్టుకున్న వేషధారణలు



కాళీమాత వేషధారణలో కళాకారులు

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- అనకాపల్లి డీఈవో అప్పారావునాయుడు



సబ్బవరంలోని బాలికల ఎస్సీ హాస్టల్‌ను నైట్ విజిట్ చేసి, విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

సబ్బవరం: పదోతరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఇ.అప్పారావునాయుడు సూచించారు. మండలంలోని రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఉప విద్యాశాఖాధికారి బి.అప్పారావుతో కలిసి మంగళవారం సందర్శించారు. టెన్త్ విద్యార్థులతో సమావేశమై, సంభాషించారు. విద్యార్థుల స్థాయిపై సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సబ్బవరంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని రాత్రి సందర్శించి, టెన్త్ విద్యార్థుల చదువు తీరును పరిశీలించారు. ఆ తర్వాత సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్ టెన్త్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, వారిని బాగా చదవాలని ప్రోత్సహించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు సానుకూల వాతావరణం ఇంట్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట ఎంఈవోలు లక్ష్మణరావు, ఎంజే రవీంద్రబాబు, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

నర్సీపట్నంలో చోరీ



షాపులోని కౌంటర్‌ను పరిశీలిస్తున్న సీఐ గోవిందరావు

నర్సీపట్నం: నర్సీపట్నం మెయిన్ రోడ్డులోని శ్రీమారుతి ఆటో మార్ట్ అమరాన్ బ్యాటరీ షాపులో సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. షాప్ షెట్టర్ తాళాలు పగలకొట్టి షాపులోని రూ.50 వేలు నగదు పట్టుకుపోయారని సీఐ గోవిందరావు తెలిపారు. నగదు తప్ప ఇతర వస్తువులేవీ తీసుకువెళ్లలేదని షాపు యజమాని ప్రసాద్‌రాజు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బైకును ఢీకొట్టిన వ్యాన్

- ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన సన్యాసిరావు

మాకవరపాలెం: బైకును వ్యాన్ ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని పాపయ్యపాలెం గ్రామానికి చెందిన కామిరెడ్డి సన్యాసిరావు, వై.మహేశ్వరి మోటార్ సైకిల్‌పై మాకవరపాలెం వస్తుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను మొదట 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లి, అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎండ తీవ్రతకు 100 కోళ్లు మృతి



కె.పి.అగ్రహారం ఫారంలో మృతి చెందిన కోళ్లు

బుచ్చెయ్యపేట: కొండపాలెం అగ్రహారంలో జొన్నపల్లి సాయిప్ప కోళ్ల ఫారంలో ఎండ తీవ్రతకు 100 కోళ్లు మృతి చెందాయి. వారం రోజులుగా కాస్తున్న ఎండకు ఈ కోళ్లు మృతి చెందాయని, తీవ్రంగా నష్టపోయానని కోళ్ల ఫారం యజమాని జొన్నపల్లి సాయిప్ప మంగళవారం తెలిపారు.

రేషన్ డీలర్ పై 6ఎ కేసు నమోదు

పాయకరావుపేట : మండలంలో గల పెంటకోట గ్రామంలో 43వ రేషన్ డిపో డీలర్ ఎ.శివకృష్ణ పై 6 ఎ కేసు నమోదు చేసినట్టు సివిల్ సప్లయి డీటీ బి.సూర్య తెలిపారు. డిపోలో 170 కేజీలు రైస్ తక్కువగా వున్నందున డీలర్ పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. డిపో నిర్వహణ బాధ్యతలను 49 వ నెంబర్ డిపో డీలర్ శ్రీనుకు అప్పగించడం జరిగిందన్నారు.

దర్జాగా సాగునీటి కాలువల ఆక్రమణ

- రియల్ వ్యాపారుల బరితెగింపు
- పట్టించుకోని అధికారులు



మునగపాకలో సాగునీటి కాలువ కప్పివేసి పైపులు ఏర్పాటు చేసిన లే-అవుట్ నిర్వాహకులు

మునగపాక : అధికారుల నిర్లక్ష్యమో లేకుంటే లే-అవుట్‌ల నిర్వాహకుల తెగింపో తెలియదు కాని మునగపాకలో సాగునీటి కాలువలు కప్పేస్తున్నారు. కేవలం సాగునీటి కాలువల ఆధారంగా పంటలు సాగించే రైతులు ఆందోళనకు గురవుతున్నా ఇవేమీ తమకు పట్టనట్టు రియల్ వ్యాపారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మునగపాక మండలంలో పలు చోట్ల రియల్ వ్యాపారులు ఎటువంటి అనుమతులు లేకుండా లే-అవుట్‌ల నిర్మాణాలు చేపడుతున్నారు. అన్ని రకాల అనుమతులు వచ్చాకే పనులు ప్రారంభించాల్సి ఉంది. అయితే వ్యాపారులు మాత్రం తమను ఆపేవారు ఎవరనే రీతిలో ప్రవర్తిస్తున్నారు. మునగపాక మెయిన్‌రోడ్డును ఆనుకొని నూతనంగా లే-అవుట్ వేసేందుకు వ్యాపారులు చర్యలు ప్రారంభించారు. అయితే లే-అవుట్‌కు వెళ్లేందుకు సాగునీటి కాలువను కప్పేసి మరీ దర్జాగా తమ పనులు కానిచ్చేస్తున్నారు. కానీ రెవెన్యూ,నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా కాలువల్లో వేసే పైప్‌లను తొలగిస్తున్నారు. తరువాత రోజు యధావిధిగా రియల్ వ్యాపారులు పైప్‌లతో సాగునీటి కాలువలను కప్పేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పనివేళల్లో ఖాళీ కుర్చీల దర్శనం



కె.కోటపాడులో ఖాళీ కుర్చీలతో ఉన్న సచివాలయం



కె.కోటపాడు సచివాలయ భవనం

- కె.కోటపాడు సచివాలయంలో సేవలందక జనం ఉసూరు

కె.కోటపాడు: గ్రామ సచివాలయాల్లో సేవలను పొందేందుకు వెళ్లిన కె.కోటపాడు గ్రామస్తులకు సిబ్బంది లేక మంగళవారం కాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. కె.కోటపాడుకు చెందిన గ్రామస్తుడు లక్ష్మీనారాయణ తన భూమికి చెందిన మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసేందుకు సచివాలయానికి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటలు అయినా కార్యాలయం తెరిచే ఉన్నా..సచివాలయ సిబ్బంది ఒక్కరూ లేరు. దీంతో సిబ్బంది ఎవరైనా వస్తారని అరగంట సేపు ఆయన వేచి ఉన్నా ఎవరూ రాలేదు. దీంతో ఆయన స్థానిక విలేకరులకు కె.కోటపాడు సచివాలయంలో సిబ్బంది ఎవరూ అందుబాటులో లేరని, సమస్యలపై వచ్చే ప్రజలు పరిష్కారం లభించక వెనుదిరుగుతున్నారని తెలిపారు. దీనిపై ఎంపీడీవో ఎ.ఎ.సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లగా బుధవారం నుంచి దివ్యాంగుల పెన్షన్ వెరిఫికేషన్ నిమిత్తం కె.కోటపాడు సీహెచ్‌సీకి తనతోనే స్థానిక పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉన్నట్టు ఆయన తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్ సెలవులో ఉండగా, వీఆర్వో, సర్వేయర్‌లు డిప్యూటేషన్‌పై వేరే పంచాయతీలకు వేసినట్టు తహసీల్దార్ తెలిపారని, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఈ-క్రాప్ నిమిత్తం ఫీల్డ్‌లో ఉన్నట్టు ఏవో సోమశేఖర్ తెలిపినట్టు ఎంపీడీవో వెల్లడించారు. సమస్యలపై సచివాలయానికి వచ్చే ప్రజలకు సమాధానం చెప్పేందుకు గుమస్తా అయినా కార్యాలయంలో ఉండేటట్టు చూడాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనుకు సూచించామన్నారు.

పనులు లేక పస్తులు

కూటమి పాలనలో కుదేలైన కూలీలు

8 నెలలుగా నిలిచిపోయిన భవన నిర్మాణాలు

అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్న వైనం



జగనన్న లేఅవుట్‌లో కొన్ని నెలలుగా నిలిచిపోయిన ఇంటిపనులు

అసంపూర్తిగా నిలిచిపోయిన సచివాలయ భవనం

తుమ్మపాల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీల పుణ్యమా అని భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని దొరికేది. అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా లేఅవుట్లు వేసి ఇళ్ల స్థలాలతో కూడిన ఇళ్లను మంజూరు చేశారు. దీంతో స్వగ్రామంలోనే నిత్యం కూలీ లభించేది. సార్వత్రిక ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇళ్లతోపాటు సచివాలయ భవనాలకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడ నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. దీంతో కూలీలు 8 నెలలుగా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణంతో పాటు మండలం దినదినాభివృద్ధి చెందుతోంది. పల్లెల్లో కూడా భవనాల నిర్మాణాలు సంఖ్య పెరుగుతూనే ఉంది. రోజూ పట్టణంలో దాదాపు వెయ్యికి పైగా భవన నిర్మాణ కార్మికులు పనులు చేస్తున్నారు. మండలంలో అన్ని గ్రామాల్లోను జగనన్న లేఅవుట్‌లో మొత్తం 2,713 గృహాలు మంజూరైతే, 1,570 ఇళ్ల నిర్మాణాలకు బిల్లుల చెల్లింపు జరగక వివిధ దశల్లో పనులు నిలిచిపోయాయి. అప్పులు చేసి పూర్తి చేయలేక లబ్ధిదారులు ఎక్కడివి అక్కడే వదిలేశారు. వీటినే నమ్ముకున్న కూలీలు ఎటుపోలేక 8 నెలలుగా ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉన్నవి వదిలేసి కొత్త పథకాలను ప్రకటిస్తూ ప్రచార ఆర్బాటాలకే పరిమితమవుతోంది. అందరికి ఉచిత ఇసుక అంటూ బూటకపు హామీలు ఇవ్వడంతో భవన నిర్మాణ యాజమానులు వేచి చూస్తున్న క్రమంలో ఉచితమన్న పదానికి అర్థం లేకుండా పోయింది. ఇసుకకు ధరలు కేటాయించింది. జిల్లాకో స్టాక్ యార్డ్ పెట్టి ఇసుక కొరత సృష్టించి భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా చేసింది. దీంతో కార్మికులు ఇళ్లకే పరిమితమై ఖాళీగా ఉంటున్నారు.

పనుల్లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న భవన నిర్మాణ కార్మికులు

మండుటెండల్లో సైతం ఓర్చుకుని నిర్మాణ పనులు చేసే భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారు. ఆషాడం మాసం మొదలుకుని పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలు ఇసుక కొరత మరింత సమస్యగా మారింది. బిల్లులు చెల్లింపుతో పాటు ఇసుక లేక భవన యాజమానులు పనులు నిలిపివేశారు. ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. భవన నిర్మాణ మేస్త్రీలు రోజుకు రూ.వెయ్యి, మగ కూలీ రూ.750, మహిళా కూలీ రూ.600 వేతనం రాగా, వారి ఖర్చులు పోను కనీసం రూ.500 ఇంటికి తీసుకెళ్లేవారు. పిల్లల పాఠశాలలు, కుటుంబ ఖర్చులకు డబ్బులు లేక అప్పుల పాలవుతున్నామని భవన నిర్మాణ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎనిమిది నెలలుగా పనిలేదు...



నేను భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తాను. రోజుకు రూ.వెయ్యి కూలి వచ్చేది. దీంతో నా ఖర్చులతోపాటు కుటుంబానికి సరిపడా అన్ని సరుకులు కొనుగోలు చేసుకుని పిల్లలను చదివించుకునే వాడిని. కొన్ని నెలలుగా భవన నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. జగనన్న కాలనీల్లో ఇళ్ల పనులు కూడా లేకపోవడంతో ఇంటికే పరిమితమవుతున్నాం.

– రామాచారి, మేస్త్రి, అనకాపల్లి

ఇళ్ల నిర్మాణాలు లేక ఖాళీగానే ఉంటున్నాం



కొన్ని నెలలుగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. రెక్కాడితే గాని డొక్కాడని మాకు వారంలో ఒక్క రోజూ పని దొరకడం లేదు. ఇసుకతోపాటు ఇతర ముడిసరుకు ధరలు అధికంగా ఉండటం, ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాల చేపట్టే ఆలోచన ఎవరూ చేయడం లేదు. కరోనా సమయంలో పనుల్లేక పడిన కష్టాలే ఇప్పుడు పడుతున్నాం.

– వి.బాలాజీ, సెంట్రింగ్ మేస్త్రి, రేబాక గ్రామం

క్లుప్తంగా

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



టెన్త్ విద్యార్థుల చదువు సామర్థ్యాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

కశింకోట: ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ప్రణాళిక బద్ధంగా చదివి టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని జిల్లా ఉప విద్యా శాఖ అధికారి పి. అప్పారావు తెలిపారు. మండలంలోని ఏనుగుతుని గ్రామాన్ని మంగళవారం రాత్రి ఆయన సందర్శించారు. అక్కడి టెన్త్ విద్యార్థుల చదువు తీరును పరిశీలించడానికి ఇళ్లకు వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అర్థం కాని అంశాలుంటే వాటిని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలన్నారు. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులు చదివి విజయం సాధించడం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంటర్లో మంచి ఫలితాలు సాధించాలి



మొదటి సంవత్సరం విద్యార్థులు

ఎస్.రాయవరం: ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ సకురు సత్యనారాయణ ఆకాంక్షించారు. కొరుప్రోలు ఉన్నత పాఠశాలలోని జూనియర్ కళాశాలలో మంగళవారం 52 మంది విద్యార్థులతో గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు. వచ్చే నెలలో పరీక్షలకు హాజరుకాబోయే విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా చదువుకోవాలన్నారు.

నిరుపేదలకు భోజనం ప్యాకెట్ల పంపిణీ



నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధి నాగేంద్ర స్వామి ఆలయం వద్ద ఉచిత ఆహార సేవా కార్యక్రమం జరిగింది. నిరుపేదలకు 50 భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర స్వామి ఆలయం చైర్మన్ బొడ్డేడ రోషన్‌కుమార్, మద్దాల క్రాంతి కుమార్ ఆలయ పెద్దలు పీలా రమణారావు, ఆడారి రామలింగ స్వామి, కొణతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

8న గౌరీపరమేశ్వరుల ఉత్సవం

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలు వద్ద వెలసిన గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) ఉత్సవం ఈ నెల 8న జరగనుంది. ఈ మేరకు ఉత్సవ కార్యక్రమాల పోస్టర్లను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మంగళవారం ఇక్కడ ఆవిష్కరించారు. ఉత్సవం సందర్భంగా డాన్స్ బేబీ డాన్స్, డాన్స్ షో, బుర్ర కథలు తదితర 20 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, నేల డాన్స్‌లు, కరీంనగర్ వారి నెమలి డాన్స్ వంటి కార్యక్రమాలు, భారీగా విద్యుద్దీపాలంకరణ, బాణసంచా ఏర్పాటు చేశామని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవం ముందు రోజ 7వ తేదీ మధ్యాహ్నం కోలాటాలతో అమ్మవారి సారె ఊరేగింపు నిర్వహించనున్నామన్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, వేగి దొరబాబు, ఆడారి నరసింగరావు, వేగి పాపారావు, కోయిలాడ నాగు, వేగి వెంకటరావు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను బాగు చేయాలి

అనకాపల్లి: స్థానిక గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్‌లో వాటర్ ప్లాంట్‌ను బాగుచేయాలని జనసేన పార్టీ పట్టణ యువ నాయకుడు కోరిబిల్లి పరి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నాలుగు నెలలుగా వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురైందన్నారు. ఇక్కడ చదువుతున్న 312 మంది విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని స్కూల్ కమిటీ సభ్యులు, విద్యాశాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులు తక్షణమే చర్యలు తీసుకోని పరిశుభ్రమైన తాగునీరు అందించాలని కోరారు. మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు.

రథసప్తమి పూజలు



రథసప్తమి పూజలు చేస్తున్న అర్చకుడు దొంతుకుర్తి శంకరరావు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో సూర్యనారాయణమూర్తి ఆలయంలో మంగళవారం రథ సప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వెదురుపర్తి, కశింకోట గ్రామాలతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సూర్యాష్టకం, ఆదిత్య హృదయంతో అర్చించారు. ఆలయ అర్చకుడు దొంతుకుర్తి శంకరరావు కార్యక్రమాలు జరిపించారు. రథసప్తమి పురస్కరించుకొని ధ్యాన వేంకటేశ్వరస్వామి, గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక శారదానదిలో జిల్లేడు, చిక్కుడు ఆకులు, రేగుకాయలతో రథసప్తమి సంప్రదాయ స్నానాలు ఆచరించారు.

సూర్యనారాయణమూర్తి కల్యాణం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో మంగళవారం మాఘమాసం రథసప్తమి పురస్కరించుకుని సూర్యనారాయణస్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంలో ఉషా పద్మినీ సంజ్ఞా ఛాయా సమేత సూర్యనారాయణమూర్తి కల్యాణాన్ని ఆలయ అర్చకులు చేపట్టారు. కార్యక్రమంలో గౌరీపంచాయత దేవాలయం అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, గీతా మహిళ మండలి, సత్తెమ్మతల్లి దేవస్థానం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

‘పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి’



అసంపూర్తిగా మూలపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

అనకాపల్లి: మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ మూలపేటలో అసంపూర్తిగా నిర్మించిన ప్రాథమిక వైద్య కేంద్రాన్ని శరవేగంగా పూర్తి చేయాలని బీఎస్పీ అనకాపల్లి నియోజకవర్గ బాధ్యుడు సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇప్పటి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది మాసాలైనా పూర్తి చేయకపోవడం అన్యాయమన్నారు. కనీస సదుపాయాలు లేని గ్రామ దేవాలయాల ప్రాంగణంలో వైద్య సిబ్బంది ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. ప్రజలు పూర్తిస్థాయి వైద్య సేవలు పొందేలా భవనాన్ని పూర్తి చేయాలని కోరారు.

రైతులందరికీ ఆధార్ తరహా గుర్తింపు కార్డులు

ఆర్‌డీవో రమణ



వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌డీవో రమణ

నక్కపల్లి: రైతులందరికీ ఆధార్ తరహా గుర్తింపు కార్డులు అందించనున్నట్లు నర్సీపట్నం ఆర్‌డీవో వి.వి. రమణ తెలిపారు. మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఏవో ఉమాప్రసాద్ రైతులకు ప్రభుత్వం జారీ చేస్తున్న గుర్తింపు కార్డుల గురించి వివరించారు. ఆర్‌డీవో మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం రైతులకు మరింత చేరువ చేస్తున్నాయన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతులకు ఆధార్ తరహా 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఆమోదించడానికి ఫార్మర్ రిజిస్ట్రీని ఏర్పాటు చేశాయన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి రైతులకు ఆధార్ తరహా ఐడీ కార్డులు అందజేస్తామన్నారు. ఇది వ్యవసాయ రుణాలను పొందడానికి, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, పంటల బీమా తదితర పథకాలతోపాటు, అర్హులైన రైతులకు చేరేలా సహాయ పడుతుందన్నారు. ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను సులభతరం చేస్తుందన్నారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఐడీ నెంబరు నమోదు చేసుకోవచ్చన్నారు.

ముగిసిన మెడికల్ విద్యార్థి అంత్యక్రియలు



విద్యార్థి షణ్ముఖ నాయుడు అంతిమ యాత్రలో మునగపాక గ్రామస్తులు

మునగపాక: పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో మృత్యువాతకు గురైన మునగపాకకు చెందిన వైద్య విద్యార్థి పెంటకోట షణ్ముఖ నాయుడు అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. స్నేహితులతో కలిసి బీచ్‌కు వెళ్లిన షణ్ముఖనాయుడు గల్లంతైన తర్వాత అతని మృతదేహాన్ని గుర్తించిన అధికారులు అక్కడ ప్రభుత్వ ఆస్పత్రిలో శవ పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అక్కడ నుంచి స్వగ్రామం మునగపాకకు తీసుకువచ్చారు. తల్లిదండ్రులు కాశీ, మాధవిలతో పాటు కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అక్కడ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించగా, కడసారి చూసేందుకు గ్రామస్తులు తరలివచ్చి నివాళులర్పించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు



పేకాటరాయుళ్లతో పోలీసులు

పరవాడ: మండలంలోని మడకపాలెం సమీపంలో నిర్మానుష్య ప్రదేశంలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పరవాడ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు జరిపారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, ఎస్‌ఐ కృష్ణారావు తమ సిబ్బందితో దాడిచేసి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.30,300 నగదు, 6 సెల్ ఫోన్లను స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ కృష్ణారావు తెలిపారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యురాలు వాణీ జగదీశ్వరి, తదితరులు

కశింకోట: క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి మనీషా తెలిపారు. తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం నిర్వహించారు. అనంతరం ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి చికిత్స పొందితే నయం అవుతుందన్నారు. 18 ఏళ్ల పైబడిన వారు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరమైన వారికి సత్వరమే ఉచిత చికిత్స అందించడానికి ఎసిడిసిడి సర్వే కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్నారన్నారు. అన్ని మొండి, దీర్ఘకాలిక వ్యాధులు కూడా నయం చేసుకోవచ్చునన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఆకుపచ్చని కూరగాయలు, తాజా పండ్లు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎ.వి. సుబ్బారావు, ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి. ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ కె.ఎస్.ఆర్.కె. నరసింహారావు, ఆరోగ్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనకాపల్లి: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎన్టీఆర్ యార్డ్ వాకర్స్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ఆవరణలో క్యాన్సర్‌పై తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్యుడు డి.డి.నాయుడు అవగాహన కల్పించారు. ధూమపానం, మద్యపానం, పొగాకు నమలడం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. హెచ్‌పీవీ వాక్సిన్ వేయించుకోవడం వల్ల గర్భాశయ క్యాన్సర్, హెపటైటీస్ బి వ్యాక్సిన్ వేయడం వల్ల కాలేయ క్యాన్సర్ రాకుండా ఉంటుందన్నారు. పరిశుభ్రమైన ఆకుకూరలు, కూరగాయలు, ఫైబర్ ఉన్న సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం చేయడం వల్ల క్యాన్సర్ వ్యాధిన పడకుండా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు రాపేటి నారాయణరావు, కార్యదర్శి యల్లపు శివ, కోశాకారి చవితిని నర్సింగరావు, సభ్యులు మాణిక్యాలరావు, ఆడారి మల్లికార్జునరావు, యల్లపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల పీహెచ్‌సీలో...

తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్.వాణిజగదీశ్వరి ఆధ్వర్యంలో క్యాన్సర్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలంలో రోజురోజుకు క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రతి వ్యక్తి వయస్సును బట్టి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. క్యాన్సర్ మొదటి దశలో గుర్తించినట్లయితే సకాలంలో మందులు వాడి ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బత్తుల మంగమ్మ, ఎం.మరియమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



మాట్లాడుతున్న వైద్యుడు డి.డి.నాయుడు

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం



జమాదులపాలెంలో ఆంజనేయస్వామికి పూజలు

కశింకోట: జమాదులపాలెం గ్రామంలో మంగళవారం ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎక్కువగా దర్శించుకుని పూజలు చేశారు. తోడపెద్దు సేవ, కోలాటాలు, తప్పెటగుళ్లు, భజనలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కరక శేషు, ఉప్పనూరి అప్పారావు, టీడీపీ నాయకుడు మొల్లి రమణ, పాల సంఘం అధ్యక్షుడు పరవాడ రాము, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా విడుదల చేయాలి

సీపీఐ నేతలు డిమాండ్



మత్స్యకార భరోసా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న సీపీఐ నాయకులు

నక్కపల్లి: ఎన్నికల హామీ మేరకు మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతి తక్షణమే విడుదల చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన రాజయ్యపేటలో మత్స్యకారులను కలిసి మత్స్యకార భరోసాపై ఆరా తీశారు. గత ప్రభుత్వం వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల చొప్పున భృతి అందించిందన్నారు. కూటమి అధికారంలోకి వస్తే మత్స్యకార భరోసా కింద రూ.20 వేలు చెల్లిస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచిందని, మరో రెండు నెలల్లో వేట నిషేధం అమల్లోకి వస్తుందన్నారు. అయినప్పటికీ ఇప్పటి వరకు పైసా సాయం చేయలేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు కారణంగా ఏడాదిలో ఆరు మాసాలు మత్స్యకారులు చేపల వేటకు దూరమవుతున్నారన్నారు. వేట తప్ప వేరే ఉపాధి పనులు తెలియని గంగపుత్రులకు తక్షణమే భృతి విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వెలుగుల అర్జున్, సన్యాశిరావు, మండల కార్యదర్శి అజయ్, బాబ్జి, అంజి పాల్గొన్నారు.

‘లీజు రద్దు చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష’

సింహాచలం: సింహగిరిపై కల్యాణమండపాల లీజును పూర్తిగా రద్దుచేసి, కాంట్రాక్టర్‌కి ఇచ్చిన నెల రోజుల గడువును ఉపసంహరించుకోవాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి జేఏసీ హెచ్చరించింది. దేవస్థానం అధికారులు స్పందించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించింది. జేఏసీ ఆధ్వర్యంలో సింహాచలంలోని తొలిపావంచా వద్ద రెండో రోజు రిలే నిరాహార దీక్షలో జేఏసీ కన్వీనర్ పూడిపెద్ది శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కల్యాణమండపాలు లీజుకివ్వడంతో అధిక ధరల వల్ల పేదలు వివాహాలు చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. గత కాంట్రాక్టర్‌కు దేవస్థానం అధికారులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు.

కల్యాణమండపం నిధుల దుర్వినియోగంపై విచారణ



వెన్నలపాలెంలోని కల్యాణమండపం

పరవాడ: మండలంలోని వెన్నలపాలెంలో నిర్మించిన కల్యాణ మండపం నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదు మేరకు అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) ఆర్.శిరీషరాణి మంగళవారం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి ప్రాథమిక విచారణ జరిపారు. పంచాయతీలోని కల్యాణమండపం ద్వారా వచ్చిన సుమారు రూ.15 లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామానికి చెందిన గొంప మారునాయుడు డీపీవోకు గత డిసెంబర్ 30న ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆమె ప్రాథమిక విచారణ నిర్వహించారు. ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన మల్లికార్జునరావు, వరలక్ష్మిలను విచారించారు. 2019 నుంచి కల్యాణమండపం లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. డీపీవో వెంట పరవాడ ఇన్‌చార్జ్ ఎంపీడీవో ధర్మారావు కూడా ఉన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 8,266 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
స్పెషల్ రకం	3,420	4,580
మొదటి రకం	3,400	4,070
రెండో రకం	3,060	3,570
మూడో రకం	2,880	3,050

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
ప్రేమిస్తావా	:సత్యనారాయణ స్క్రీన్-2
మదగజరాజ	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
ఏజెంట్ గయ్ 001	:వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్	:శ్రీసత్య
మహేష్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 123 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-16 యూనిట్లు, బీ పాజిటివ్-42 యూనిట్లు, ఓ పాజిటివ్-60 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 389 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 324 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.